క్లుప్తంగా

రామలింగేశ్వరుడికి నేరేడు పండ్లతో అభిషేకం



పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10.30 గంటలకు స్వామివారికి 108 కేజీల నేరేడు పండ్లతో అభిషేకం చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు గ్రామంలో బోసుబొమ్మ సమీపంలోని సంగా రెసిడెన్సి వద్ద నుంచి భక్తులు, సంగా నరసింహారావు దంపతులు శ్రీపార్వతీ దేవికిఆషాఢ సారెను మంగళవాయిద్యాలతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరుగుతుందని దేవస్థానం ఈఓ గంగాధరరావు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

రామవరప్పాడు: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.96వేల ఎల్‌వోసీని గురువారం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో బాధితుని కుటుంబసభ్యులకు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ గ్రామానికి చెందిన బాలుడు నితీష్ రాజ్ చెవికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. వీరి ఆర్థిక పరిస్థితి వైద్యానికి సహకరించకపోవడంతో ఎమ్మెల్యే వంశీమోహన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన వంశీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోనేరు సుబ్బారావు, మోతే సుబ్బారావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మకు సారె సమర్పణ



ఉయ్యూరు: భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధిగాంచిన ఉయ్యూరు వీరమ్మకు గురువారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. వీరమ్మ ఆలయం నుంచి మెట్టినింటి వరకూ పారు పూడి, నెరుసు వంశస్తులు, ఆడపడుచులు, భక్తులు సారెతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సారె సమర్పించి విశేష పూజలు జరిపించారు. ఉయ్యూరు శివాలయం, శ్రీ విజయదుర్గాదేవి ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన అమ్మవారికి పూజలు చేయించి భక్తిపారవశ్యం పొందారు.

దావాజిగూడెం(గన్నవరం): దావాజీగూడెంలో ఉన్న శ్రీరణఅంకమ్మ తల్లికి గురువారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు.

సామాజిక పరిస్థితులు అర్థం చేసుకోవాలి

పెనమలూరు: మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరమని, విద్యార్థులు సామాజిక పరిస్థితులు అర్థం చేసుకోవాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ వై.చలమయ్య అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మానవుల అక్రమ రవాణాపై విద్యార్థులను అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక పరిస్థితులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలు చైతన్యవంతులై అసాంఘిక శక్తులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శ్రీకాంత్, వినోద్‌కుమార్, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు దాడులు జరిపారు. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కంకిపాడు సినిమాహాలు సెంటరు వెనుక రోడ్డులోని కొల్లి వెంకటరావు రేకుల ఇంటిలో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం అందింది. ఆ ఇంటిపై బుధవారం అర్ధరాత్రి తర్వాత దాడులు నిర్వహించారు. ఇంటిలో కోత ముక్క ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 25,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై కేసు

కంకిపాడు: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ఈడుపుగల్లు గ్రామ సచివాలయం-2 ప్రాంగణంలోని ఆరోగ్యశ్రీ బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సచివాలయం భవనంపై జై జనసేన అని రాశారు. అంతేకాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని చించేశారు. ఈనెల 12న జరిగిన ఘటనపై పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ బి.వెంకటేశ్వరరావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం, చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనలపై 447, 427, 153ఏ ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మీ తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



ముక్కపాడులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఉయ్యూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ వల్లభనేని నాని. అధికారులు, నాయకులు

తాడిగడప కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సమర్థంగా అమలు చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. పోరంకి సచివాలయం 5లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అన్ని సచివాలయాల్లో కార్యక్రమం జరుగుతోందని దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం 155 సర్టిఫికెట్లు జారీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అభినేష్, వైఎస్సార్ సీపీ నేతలు అంకెం రాజేష్, శ్రీనివాసరావు, అద్దేపల్లి చందు, ఆకునూరు సుబ్బారావు, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

■ వణుకూరు సచివాలయం 2లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి విజయ మాట్లాడుతూ జగనన్న పాలన మధ్య,పేద వర్గాల వారికి అందుబాటులో ఉంటుందన్నారు. డీఎల్‌డీవో నాంచారావు మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లు వారం రోజుల్లోనే జారీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 87 సర్టిఫికెట్లు గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి జి.రాజా, పెనమలూరు సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా, ఏవో లోయ శివశంకరరావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

ఉంగుటూరు: అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. ముక్కపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులై ఉండి ఇంకా సంక్షేమం అందని వారు ఉంటే వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. కుల ధ్రువీకరణ 165, ఆదాయ ధ్రువీకరణ 144, ఆధార్ మొబైల్ లింక్ 22 మందికి చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముక్కపాడు, లంకపల్లి, వేమండ సర్పంచులు ఎస్.అంజనాదేవి, కె.సుజాత, నిర్మల, ఎంపీటీసీ నాగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి, ఎంపీడీవో శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సీతారామరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు: జగనన్న సురక్షతో పాలనలో విప్లవాత్మక మార్పులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని 13, 14 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. 668 మందికి 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు పైలా శ్రీనివాసరావు, కూరాడ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: గొడవర్రు, కుందేరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్‌లు మేరుగు విజయచంద్రశేఖర్, కలకోట రాధిక, బాయిరెడ్డి నాగరాజు, ఎంపీటీసీలు చుండూరు నిర్మలజ్యోతి, నందిపాటి బిందుమాధవి అధికారులు పాల్గొన్నారు.

ఉమా నోరు అదుపులో పెట్టుకో

వైఎస్సార్‌సీపీ నాయకుల హెచ్చరిక

రామవరప్పాడు: మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే రాష్ట్ర ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. నున్న గ్రామంలో జరిగిన టీడీపీ బస్సుయాత్రలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, కొడాలి నాని, వసంత కృష్ణప్రసాద్‌లపై ఉమా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిడమానూరులో గురువారం ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, సర్పంచ్ శీలం రంగారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. గన్నవరం నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తున్న ఎమ్మెల్యే వంశీపై ఆరోపణలు చేయడం నీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని, నీకు దమ్ము ధైర్యం ఉంటే గన్నవరం నియోజకవర్గం నుంచి వంశీపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే వంశీ రైతుల ప్రయోజనార్థం పోలవరం కుడికాలువపై సొంత నిధులతో 320 మోటార్లు ఏర్పాటు చేసి రైతులు రెండు పంటలు పండించుకునే విధంగా సహకారం అందించారన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటావని హెచ్చరించారు.

ప్రజారోగ్య రక్షణకు ప్రథమ ప్రాధాన్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, సర్పంచ్ పద్మజ

గన్నవరంరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ చెప్పారు. మండలంలోని ముస్తాబాదలో రూ.1.82 కోట్ల ఖర్చుతో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తేవటం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయటం, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో రోగుల వద్దకే సేవలను అందజేస్తున్నారన్నారు.

డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, మండల వైద్యాధికారి డాక్టర్ కె.ఆనంద్‌బాబు, ఆయుష్ వైద్యులు డాక్టర్ పి.శ్రీధర్‌బాబు, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, సర్పంచ్ వి.రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొండపావులూరు వద్ద రూ.3.30 కోట్లతో నిర్మించే ఎన్‌డీఆర్‌ఎఫ్ క్యాంపస్‌కు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వంశీ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ఉప్పుగంటి పద్మజ, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం సేవలు అందాలి

నున్న(విజయవాడరూరల్): జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ నూరు శాతం సర్వీసులు అందాలని జిల్లా కోఆపరేటివ్ రిజిస్ట్రార్, విజయవాడ రూరల్ మండల ప్రత్యేక అధికారి సీహెచ్ శైలజ అన్నారు. నున్న గ్రామ సచివాలయం 2 లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అధ్యక్షతన జరిగింది. శైలజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత గల వారందరికీ అందజేయాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ మాట్లాడారు. 452 మందికి ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వార్డు సభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో మంచినీటి చెరువు గట్టుపై ప్రభుత్వ స్థలాన్ని గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్, టీడీపీ నేత మాదాల శ్రీనివాసరావు ఆక్రమించారని పంచాయతీ కార్యదర్శి పి.సురేష్ కుమార్ తెలిపారు. ఆ స్థలంలో తాటాకులతో గుడిసె నిర్మించారని చెప్పారు. స్థలాన్ని ఖాళీ చేయాలని గతంలో పలుమార్లు ఆదేశించామన్నారు. కానీ ఆయన స్పందించకపోవటంతో గుడిసెను తొలగించామని పేర్కొన్నారు. ఈ స్థలంలో మంచినీటి పథకం ఏర్పాటుకు ప్రతిపాదన ఉందన్నారు.

110 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: ఈడుపుగల్లులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 110 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు



షాహిస్తా పర్వీన్ | ఎల్.చరణ్ తేజ

ఉంగుటూరు: మానికొండలోని గోగినేని పిచ్చియ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన షాహిస్తా పర్వీన్, ఎల్.చరణ్ తేజలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షాహిస్తా పర్వీన్‌కు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించగా చరణ్‌తేజ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు పొందారని చెప్పారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పర్వీన్, చరణ్ తేజ్‌లను, వారి విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.



ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన షాజిదాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన షేక్ షాజిదాకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. షాజిదాకు టెన్త్‌లో 567 మార్కులు సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని మాట్లాడుతూ తమ విద్యార్థి సీటు సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థిని షాజిదా మాట్లాడుతూ తాను కష్టపడి చదివి ఐఏఎస్ అవ్వాలనే లక్ష్యంతో ఉన్నానని తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ముక్కపాడులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న చల్లగుళ్ల కుటుంబసభ్యులు

ఉంగుటూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. ముక్కపాడులో రూ.21.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని స్థల దాతల చేతుల మీదుగా గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న రోగాలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించి, రోగాలు తీవ్రస్థాయికి వెళ్లకుండా ముందే గుర్తించి పెద్ద ఆసుపత్రిలో సేవలు అందజేస్తారని చెప్పారు. అనంతరం స్థల దాతలు చల్లగుళ్ల ఆదినారాయణ చౌదరి దంపతులు, చల్లగుల్ల లక్ష్మీమోహనరావు దంపతులు, చల్లగుళ్ల కృష్ణమూర్తి దంపతుల చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ అంజనాదేవి, ఉంగుటూరు పీహెచ్‌సీ డాక్టర్ కె.వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో గంగానమ్మకు పూజలు



పెరికీడులో గంగానమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గంగానమ్మ తల్లి ఆలయంలో ఆషాఢమాసం ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలురకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి మాతగా విశేషంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి విచ్చేసి పొంగళ్లు, కదంబం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి, గ్రామ ప్రముఖులు నండూరి సత్యవెంకటేశ్వర శర్మ, మెరుగుమాల వేణు, పుట్టి వీర్రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు ఆటో వితరణ



ఆటోను అందజేస్తున్న దాత వెంకట్

ఉయ్యూరు: దివ్యాంగులను ప్రేమతో ఆదరించడం సామాజిక బాధ్యతగా భావించాలని ఏపీఎన్నార్టీ సొసైటీ అధ్యక్షుడు వెంకట్ ఎస్.మేడపాటి అన్నారు. స్థానిక శిరీష మానసిక దివ్యాంగుల స్వచ్ఛంద సేవాసంస్థకు రూ. 3 లక్షలు విలువ చేసే ఆటోను గురువారం ఆయన వితరణగా అందించారు. వెంకట్ మాట్లాడుతూ శిరీష మానసిక దివ్యాంగుల కేంద్రానికి సొసైటీ తమ వంతు సాయం ఎప్పుడూ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ హేమలత, డిప్యూటీ డైరెక్టర్ విజయకుమారి, కేంద్రం సెక్రటరీ ఎంఎస్ రావు పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక ఎంవీఆర్ నగర్‌కు చెందిన ఎం.నదియశ్రీ ఎనిమిదేళ్ల క్రితం లీలామణికంఠవరప్రసాద్‌ను వివాహం చేసుకుంది. అప్పుడు కట్నకానుకలు ఇచ్చారు. వీరికి పాప జన్మించింది. భార్య ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ పని చేస్తుండగా భర్త సెక్యూరిటీ గార్డుగా చేస్తున్నాడు. కొంతకాలంగా భర్త ఉద్యోగానికి వెళ్లకుండా దురలవాట్లకు బానిసగా మారాడు. అత్త విజయలక్ష్మి భర్తకు మద్దతుగా అదనపుకట్నం తీసుకురావాలని వేధించసాగారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

పెనమలూరు: తన భార్య కనిపించటంలేదని భర్త ఫిర్యాదు చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో చెరుకూరి గంగాధర్ తన భార్య మధులతతో నివసిస్తున్నాడు. అతను తాడిగడపలో లేత్‌మిషన్ ఆపరేటర్. ఏడాది క్రితం వీరికి వివాహమైంది. భార్య తరచుగా ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడటంతో అతను.. అత్తింటివారి దృష్టికి తీసుకెళ్లాడు. భార్యను ఫోన్ మాట్లాడవద్దని ఆమె ఫోన్‌ను అతను తీసుకున్నాడు. దీంతో భార్య మధులత భర్త ఇంట్లో లేని సమయంలో మంగళవారం అదృశ్యమైంది. పలుచోట్ల వెదికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఆవులు చోరీ

పెనమలూరు: కానూరులో రెండు ఆవుల చోరీ జరగటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ అబీబ్ బైక్ మెకానిక్. అతను కొంతకాలం క్రితం కుంచెనపల్లి నుంచి రెండు ఆవులు తీసుకొచ్చాడు. కానూరు పప్పులమిల్లు వద్ద అశ్వంత్ అనే వ్యక్తి షెడ్డులో ఉంచి పెంచుతున్నాడు. ఈ నెల 11వ తేదీన ఆవులకు అబీబ్ మేత వేసి ఇంటికి వెళ్లాడు. 12వ తేదీ ఉదయం వచ్చి చూసుకునే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆవులను చోరీ చేసినట్లు గుర్తించాడు. దీనిపై అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ రెండు ఆవులకు రూ. 3.10 లక్షల ధర ఉంటుందని పేర్కొన్నాడు.

సెల్‌ఫోన్ అపహరణ

గన్నవరం: ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి కళ్లుగప్పి ఆయన సెల్‌ఫోన్‌ను దోచుకుపోయిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మానేపల్లి భానుమూర్తి ద్విచక్ర వాహనంపై వెళుతూ పంచాయతీ కార్యాలయం వద్ద ఆగారు. అదే సమయంలో అటుగా బైక్‌పై వెళ్తున్న యువకుడు సడన్ బ్రేక్ వేయడంతో వాహనంతో పాటు పక్కకి వాలిపోయాడు. దీంతో సహాయం చేసేందుకు ముందుకువచ్చిన భానుమూర్తి ఆ బైక్‌ను పైకి లేపే క్రమంలో ఆయన సెల్‌ఫోన్‌ను లాక్కుని సదరు యువకుడు పరారయ్యాడు. ఘటనపై భానుమూర్తి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన యువకుడి వెంట మరో యువకుడు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

జనసేన నాయకులపై కేసు

కంకిపాడు: వలంటీర్లు చేపట్టిన నిరసన ర్యాలీని అడ్డగించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన జనసేన నాయకులపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వలంటీర్లు ఈనెల 12న కంకిపాడులో నిరసన ర్యాలీ చేశారు. అదే సమయంలో ర్యాలీ చేయటానికి వీల్లేదంటూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా జనసేన నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజా, ఉండి నాని, మహేష్ మరికొందరు కార్యకర్తలు ప్రయత్నించారు. వీరి చర్యపై 341, 290, 506, 143 ఆర్/డబ్ల్యూ149 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు అరెస్టు

రామవరప్పాడు: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ, అమ్మకాలు సాగిస్తున్న నలుగురు వ్యక్తులను పటమట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పుప్పాల ప్రశాంత్ కుమార్, బెల్లం వెంకటేశ్వరరావు, గాలి తేజ వర్ధన్, కగ్గా ప్రశాంత్ దూర ప్రాంతాల నుంచి గంజాయిని అక్రమంగా తీసుకొచ్చి నగరంలో పలు చోట్ల అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న పటమట సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్‌ఐ బాషా సిబ్బందితో గ్రామంలోని హనుమాన్‌నగర్ కట్ట వద్ద వీరిని వలపన్ని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 1.5 కేజీల గంజాయి, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.